ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

నిజాంపేట్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేదలకు మేలు జరుగుతుందని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం ఓల్డ్ పంచాయతీ ఆఫీసులో ద మాస్కు హెల్త్ కేర్ సొల్యూషన్ వ్యవస్థాపకులు టి.శ్రీకాంత్ ఆధ్వర్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

అంకితభావంతో పని చేస్తా

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీగా ఉంటూ అంకితభావంతో పని చేస్తానని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గార్షే శ్రీనివాస్ తెలిపారు. ఆయన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఆదివారం నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ పదవి ఎంపిక చేసిన పార్టీ పెద్దకు కృతజ్ఞతలు తెలిపాడు


నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

గాజులరామారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం గాజులరామారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 27 ఏళ్ల కాంగ్రెస్ పార్టీలో పని చేశానని, మళ్లీ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, కూన శ్రీనివాస్ గౌడ్, సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని పరామర్శించిన భరత్‌సింహారెడ్డి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు దాడిలో మృతి చెందిన బాలిక కుటుంబాన్ని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గడ్ నుంచి వలస వచ్చి గాయత్రి నగర్‌లో గుడిసెల్లో నివాసం ఉంటారు. ఈనెల 13న ఆడుకుంటున్న రెండున్నరేళ్ల దీపాలిపై కుక్కలు దాడి చెయడంతో మృతి చెందిన విషయం తెలుసుకుని భరత్‌సింహారెడ్డి వారికి సంఘీభావం తెలియజేశారు. అచ్చుత్‌వర్ధన్, సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్, మధుసూదన్, రాజు, మరి కొంత మంది ఉన్నారు.


బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భరత్‌సింహారెడ్డి


రమేష్ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకుంటున్న రూపాదేవి

బీజేపీ మహిళా మోర్చా బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలిగా రూపాదేవి

బాలానగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలుగా కే.రూపాదేవి నియమితులయ్యారు. నియామకపు పత్రాన్ని డివిజన్ అధ్యక్షుడు జి.రమేష్ బాలానగర్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమక్షంలో ఆదివారం ఆమెకి అందజేశారు. ఈ సందర్భంగా రూపాదేవి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు అధిష్టానానికి, సీనియర్, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కే.రమేష్, ఆంజనేయులు, బసవరాజు, వాణిశ్రీ, మంజు సునీత పాల్గొన్నారు.


సంగీత విభావరిలో పాటలు పాడుతున్న చిన్నారులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్ కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగించారు. వేడుకల్లో భాగంగా ఆలయంలోని సాంస్కృతిక వేదికపై మణిసుధా సాహితీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. చిన్నారులు భక్తిసంబంధ పాటలు పాడి అలరించారు. ఈనెల 17వతేదీ వరకూ కొనసాగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు, అమ్మవార్ల శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు పూజారి రామకృష్ణమాచార్యులు తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి

లక్ష్మారెడ్డి గెలుపు తథ్యం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని విజయం తథ్యమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం తొమ్మిదో ఫేజ్‌లో నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆదరించిన మాదిరిగానే లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్, మందలపు సాయిబాబు చౌదరి, జనగాం సురేష్‌రెడ్డి, కట్టా నరసింగరావు, జన్ను సాయి శ్రీనివాస్, సుంకర సునీల్, పాతూరి గోపీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రజక సంఘం సభ్యులు

నిజాంపేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన దుర్గా భవాని రజక సంఘం సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ రజక సంఘం వారు ధోబీఘాట్ కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్, క్రిస్టియన్, మైనార్టీ నాయకులు రవికుమార్, కన్నయ్య, శ్రీనివాస్, లోవరాజు, గోవింద్, వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు


దూలపల్లి గ్రామంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

మహనీయుడు అంబేడ్కర్

అంబేడ్కర్ జయంతిని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, అధికారులు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.

\- జోన్‌బృందం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)


జోనల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు


బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు


దయార్‌గూడలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు


పీజేఆర్‌నగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


ఫతేనగర్ హరిజనబస్తీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్, స్థానిక నాయకులు


తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


కొండాపూర్ మున్సిపల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ నాయకులు జిమ్మి దేవేందర్, షేక్ ఇబ్రహీం


అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


జేఎన్‌టీయూలో క్యాంపస్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకట నరసింహారెడ్డి, డా.టి.మాధవి కుమారి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

లింగంపల్లిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

గచ్చిబౌలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తారానగర్, పాపిరెడ్డికాలనీలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి ఓటర్లను కలిసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రంజిత్‌రెడ్డి నాయకత్వంలో శేరిలింగంపల్లి అభివృద్ధిని చూసి గెలిపించాలని కోరారు.


ప్రచారం చేస్తున్న సీతారెడ్డి

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాయదుర్గం, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డి గచ్చిబౌలి అపర్ణ సైబర్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేశ, రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. విశ్వేశ్వరరెడ్డికి ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని అలాంటి వ్యక్తిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.


సంగీతారెడ్డి

ఆటోలో మరిచిపోయిన నగలు బాధితుడికి అందజేత

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న కుమార్తె చికిత్స కోసం గండిమైసమ్మ నుంచి షాపూర్‌నగర్‌కు వచ్చిన వ్యక్తి ఆటోలో బంగారు నగలు ఉన్న బ్యాగు మరిచిపోయాడు. దీంతో బాధితుడు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించాడు. ఈ సంఘటన ఈనెల 13వ తేదీన జరిగింది. వెంటనే క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ పుటేజ్ ఆధారంగా ఆటోను గుర్తించి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలను బాధితుడు చందర్‌కు అందజేశారు. బంగారు ఆభరణాలు తిరిగి ఇప్పించిన జీడిమెట్ల పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.


బాధితునికి నగలు అందజేస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్‌లో పీడీఎస్ బియ్యం స్వాధీనం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 95 వేల రూపాయల విలువచేసే 3,800కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుభాష్‌నగర్‌కు చెందిన సంగిశెట్టి వెంకటేశ్వర్లు(52) అనే వ్యక్తి కొంతకాలంగా పెద్దఎత్తున రేషన్ బియ్యం సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లును రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో నిందితుడు వెంకటేశ్వర్లు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మియాపూర్, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): ఎస్ఓటీ మేడ్చల్, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక లక్షా 96 వేల రూపాయల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆర్గనైజ్ చేసిన రాజ్‌కుమార్‌తో పాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజారామ్ కాలనీలో చలివేంద్రం ప్రారంభం

మియాపూర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ రాజారామ్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రఘునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం బాటసారులు, కాలనీవాసులకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, హరీష్‌రావు, నరేందర్, మహేష్, రమేష్, ముకేందర్, దీపక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే దారిలో గల వివేకానంద విగ్రహం వద్ద మృతి చెంది ఉన్నాడు. స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సమష్టికృషితో కాలనీ అభివృద్ధి

గచ్చిబౌలి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడాకాలనీ అభివృద్ధి కోసం సంక్షేమ సంఘం కృషి చేస్తుందని నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు పి.జలేందర్‌రెడ్డి అన్నారు. కమిటీ సభ్యుల సహకారాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘం మొదటి సమావేశం ఆదివారం నిర్వహించారు. కమిటీ ఏర్పడిన తర్వాత కాలనీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో అక్రమ చెత్తడంపింగ్‌ను అడ్డుకోవడం, మట్టిరోడ్లను సొంత నిధులతో మరమ్మతులు చేసుకోవడం, వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు రంజిత్, ప్రధాన కార్యదర్శి భరత్, కోశాధికారి దొరబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జలేందర్‌రెడ్డి

భెల్ టౌన్‌షిప్‌లో విషూ వేడుకలు

భెల్‌కాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లో నివసించే కేరళవాసులు కుటుంబాలతో కలిసి విషూ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కేరళవాసులకు విషూ పర్వదినం తో నూతన సంవత్సరం ఆరంభమవుతుండడంతో ఈ పండుగను వైభవంగా జరుపుకున్నారు. కాలనీలోగల పలు ఆలయాల్లో విశేష పూజలు చేశారు. అయప్పస్వామి దేవాలయంలో 'స్వామియే శరణం అయప్ప' అంటూ భక్తుల శరణుఘోషల నడుమ వేడుకలు నిర్వహించారు. కేరళ సాంప్రదాయ పంచవాయిద్యాల నడుమ అయప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భజనమండలి ఆధ్వర్యంలో ఆలపించిన అయప్ప భక్తి గీతాలకు భక్తులు శృతి కలిపారు.

ధర్మపురి క్షేత్రంలో కొనసాగుతున్న ఉగాది సంబరాలు

మియాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్ శ్రీధర్మపురి క్షేత్రంలో ఉగాది సంబరాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం భాస్కర డ్యాన్స్ అకాడమి గురువు సాత్విక శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఘట్టి కృష్ణమూర్తి శిష్యబృందం గద్య పద్యాలతో అందరిని అలరించారు. అనంతరం ఘట్టికృష్ణమూర్తి, సాత్వికను ధర్మపురిక్షేత్ర ట్రస్టీ సత్యవాణి ఘనంగా సన్మానించారు.


ఘట్టికృష్ణమూర్తి, సాత్వికను సన్మానిస్తున్న ఆలయ ట్రస్టీ సత్యవాణి

నిమ్స్‌లో అంకో ఇమేజింగ్‌పై సీఎంఈ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు మూడో వర్ధంతి సందర్భంగా అంకో ఇమేజింగ్‌పై సీఎంఈని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రకాల కేన్సర్లపై వైద్యులు మాట్లాడారు. కేన్సర్‌లో కొత్త చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలపై చర్చించారు. కార్యక్రమంలో కేన్సర్ నిపుణులు, రేడియాలజిస్టులు, న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిషియన్లు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప, దివంగత ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు కుటుంబసభ్యులను సత్కరించారు.

కార్మికుల అభివృద్ధికి కృషి చేసిన వారిని ఎప్పటికీ మరువరు

భెల్‌కాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసే వారిని కార్మికులు ఎప్పటికీ మరువరని బ్రాహ్మణ సంక్షేమ సంఘం భెల్ శాఖ అధ్యక్షుడు ఎంవీ.శాస్త్రి పేర్కొన్నారు. భెల్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు స్వర్గీయ వాసుదేవరావు సంతాపసభను ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లో గల సాయిబాబా మందిర ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జీఎం లు, ఉన్నతాధికారులు, మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సభలో పాల్గొని మాట్లాడుతూ సంస్థ అభ్యున్నతికి కష్టపడిన వారి పేరు సంస్థ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుందన్నారు. కార్మికుల సమస్యలను అవలీలగా పరిష్కరించగల సమర్థుడు వాసుదేవరావు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.


సంతాపసభలో ప్రసంగిస్తున్న బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎంవి.శాస్త్రి

అందంగా ఉండే ప్రతిఒక్కరూ సెలబ్రిటీనే..

దర్శకుడు దాసరి మారుతి

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి). అందం ఆనందాన్ని ఇవ్వడమే కాదు.. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని దర్శకుడు దాసరి మారుతి అన్నాడు. ఈ మేరకు ఆదివారం లులు మాల్ రోడ్డులో ఈస్తటిక్ లుక్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. తెరపైనే కాదు.. రియల్ లైఫ్‌లో అందంగా ఉండే ప్రతిఒక్కరూ సెలబ్రిటీనే అన్నారు. ఒకప్పుడు ఈ తరహా చికిత్సలు పరిమితంగా, ఖరీదుగా ఉండేవన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న అత్యాధునిక, సాంకేతిక పరమైన సదుపాయాలతో స్కిన్, హెయిర్, చికిత్సలతో పాటు విభిన్న సేవలు అందరికీ చేరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫేషియల్ కాస్మెటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ రఘు సాయిరామ్ తెరుపల్లి, కాస్మోటాలజిస్టు డాక్టర్ మనోజ్ బొజ్జా, డాక్టర్ శ్వేత బెడిగి, డాక్టర్ మానుష మోదుగు, వెంకటేష్ ఏలేగుపల్లి, బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కూకట్‌పల్లిలో ఈస్తటిక్ లుక్స్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సినీ దర్శకుడు మారుతి

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి: రంజిత్‌రెడ్డి

గచ్చిబౌలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం బొటానికల్‌గార్డెన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వాకర్స్‌తో మాట్లాడారు. తనకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు అమలు చేయ లేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలను పదేళ్ల అధికారంలో ఉండి అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో సంతోషంగా ఉన్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి అభివృద్ధిలో తన వంతు సహకారం ఉంటుందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్